క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిని 22వ డివిజన్ నేతలు, కార్యకర్తలు మర్యాపూర్వకంగా బుధవారం కలిశారు. డివిజన్లోని పలు అంశాలను ఆయనకు తెలియజేశారు.

ప్రత్యేకావసరాల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



నెల్లూరు (పొగతోట): జిల్లాలో ప్రత్యేకావసరాలు గల విద్యార్థులకు ఉపకరణాలను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జేసీ కార్తీక్, సమగ్ర శిక్ష అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్‌పర్సన్, జేసీ మాట్లాడారు. దివ్యాంగుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. డీఈఓ బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల వాటా 15 శాతానికి తగ్గకూడదు

నెల్లూరు రూరల్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మైనార్టీల వాటా 15 శాతానికి తగ్గకుండా చర్యలు చేపట్టాలని డీఆర్వో ఉదయభాస్కర్‌రావు సూచించారు. సంక్షేమ కార్యక్రమాల్లో మైనార్టీలు అనే అంశంపై కలెక్టరేట్లోని ఎస్సార్ శంకరన్ హాల్లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోందని, మైనార్టీలు అధికంగా నివసించే ప్రాంతాల్లో అవసరమైన చోట ప్రత్యేక పాఠశాలల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని కోరారు. మైనార్టీ వర్గాలు అధికంగా ఉన్న చోట నూతన అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. టైలరింగ్, బ్యూటీషియన్ వంటి కోర్సులతో పాటు జ్యూట్ బ్యాగుల తయారీ, ఎంబ్రాయిడరీ వర్క్స్ తదితరాల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు.

ఇఫ్తార్ విందు రేపు

కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఇఫ్తార్ విందును జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు నిర్వహించనున్నామని మైనార్టీల సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ హైఫా, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష ఏపీఓ వెంకటసుబ్బయ్య, మైనార్టీ వ్యవహారాల ఎన్జీఓ అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

హరివిల్లు ఉగాది పురస్కారాల ప్రదానం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న తనికెళ్ల భరణి తదితరులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో హరివిల్లు ఉగాది పురస్కారాలను హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 29న ప్రదానం చేయనున్నారని ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మాగుంట లేఅవుట్లోని ఓ రెస్టారెంట్‌లో బుధవారం ఆవిష్కరించారు. 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు దోర్నాల హరిబాబు, సినీ నిర్మాత జనార్దన్‌రెడ్డి, భాస్కర్, అమీర్‌జాన్, లక్ష్మీకాంతబాబు, దోర్నాల కామేశ్వరరావు, దోర్నాల శ్రీనివాసరావు, శివలంకి జనార్దన్, రెమో, నంద తదితరులు పాల్గొన్నారు.

బీద రవిచంద్రకు అభినందన

నెల్లూరు సిటీ: ఎమ్మెల్సీగా ఎన్నికైన బీద రవిచంద్రకు అభినందన కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం నిర్వహించారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు నందిమండల భానుశ్రీ, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే సీఐ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రైల్వే సీఐగా సుధాకర్ బాధ్యతలను బుధవారం స్వీకరించారు. ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలను సిబ్బంది తెలియజేశారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ రైళ్లలో నేరాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపడతామని చెప్పారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేయనున్నామని పేర్కొన్నారు.

ప్రభుత్వం మారింది.. నివేదికలూ మారాయి

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పార్టీ శ్రేణులను పలకరిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (పొగతోట): ప్రభుత్వం మారాక.. నివేదికలూ మారిపోయాయని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయానికి వేలాదిగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి బుధవారం ఆయన మాట్లాడారు. 2023, డిసెంబర్‌లో అప్పటి జిల్లా మైనింగ్ అధికారితో పాటు వివిధ విభాగాలకు చెందిన వారు వెళ్లి అక్రమ మైనింగ్ జరగలేదని, 1050 మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్, పల్స్‌ఫర్, మైకా ఖనిజ గుట్టలను గుర్తించామని నివేదిక ఇచ్చిన అంశాన్ని గుర్తుచేశారు. అయితే నూతన ప్రభుత్వం కొలువుదీరాక ఇవి మారిపోయాయని ధ్వజమెత్తారు. అక్రమ మైనింగ్ జరగలేదని నివేదిక ఇచ్చిన జిల్లా మైనింగ్ అధికారి.. ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో దీనిపై విచారణ జరపాలని పొదలకూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారని చెప్పారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులను ఒక్కొక్కరిగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. తనకు సంబంధం లేకపోయినా, ముద్దాయిగా అక్రమంగా ఇరికించారని ఆరోపించారు. పోలీసులు ఎన్ని తప్పుడు కేసులు బనాయించినా, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామే తప్ప బెదిరేదిలేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో జగనన్నే తన ధైర్యం.. ప్రజలు, నేతలు, కార్యకర్తలే ఆస్తి అని చెప్పారు. తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలను జీవితంలో మరువలేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫోన్లు చేసి ధైర్యాన్నిస్తున్న నేతలు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలను తెలియజేశారు.

కాకాణితో భేటీ అయిన చంద్రశేఖర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి





కాకాణితో భేటీ

నెల్లూరు (పొగతోట): రామ్‌జీనగర్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో భేటీ అయ్యారు.

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై వీరు చర్చించారు.

29న ఉగాది సంబరాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ఉగాది సంబరాల్లో భాగంగా గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో తెలుగు పాటల పోటీలను శనివారం ఉదయం తొమ్మిది గంటలకు ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని నిర్వాహకుడు కేతా సుబ్బారావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నర్తకి సెంటర్‌లో బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. విజేతలకు బహుమతులను అందజేయనున్నామని చెప్పారు. ,విశ్రాంత ఏఎస్పై అంకిరెడ్డి, రఘురామిరెడ్డి, మారి పాల్గొన్నారు.

వైఎస్సార్టీయూసీ ఆవిర్భావ దినోత్సవం రేపు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్షుడు జయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని కార్మికులకు అండగా నిలిచి, అనుబంధ విభాగాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కార్యాచరణను రూపొందించనున్నామని వెల్లడించారు. రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, అసంఘటిత కార్మిక రంగ నేత సమద్, జిల్లా కార్యదర్శి సునీల్ గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన త్యాగరాజ స్మరణోత్సవాలు



సీతారాములు, శివపార్వతుల కల్యాణం



భక్తులకు అన్నదానం

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్మరణోత్సవాలు బుధవారంతో ముగిశాయి. గాత్ర, వీణానాద కచేరీలు, కీర్తనలను ఔత్సాహిక సంగీత కళాకారులు నిర్వహించారు. త్యాగరాజస్వామి, అన్నమాచార్య కీర్తనలను ఆలపించారు. అన్నప్రసాదాన్ని మూడు వేల మందికి అందజేశారు. పురమందిర ప్రాంగణంలోని ఓపెన్ ఆడిటోరియంలో సీతారాములు, శివపార్వతుల కల్యాణాలను నేత్రపర్వంగా జరిపారు. త్యాగరాజస్వామికి సుగంధభరిత పుష్పాలతో అభిషేకాన్ని నిర్వహించారు. భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవీ ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

నెల్లూరు(క్రైమ్): నగరంలోని కుసుమ దళితవాడ సమీపంలో గల ఓ వైన్ షాపు వద్ద మద్యం మత్తులో ఆరుగురు యువకులు బుధవారం హల్‌చల్ చేశారు. ప్రధాన రహదారిపై వాహన రాకపోకలను అడ్డుకోవడమే కాకుండా స్థానికంగా ఉన్న దుకాణదారులపై వీరంగం చేశారు. దీంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చేసేదేమీ లేక మిన్నకుండిపోయారు. ఇలాంటి ఘటనలు ఇక్కడ నిత్యకృత్యంగా మారాయని చెప్పారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించండి



నెల్లూరు సిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కమిషనర్ నందన్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటి చెత్త సేకరణ వాహనాల ద్వారానే వ్యర్థాలను సేకరించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలేసే వారిని గుర్తించి జరిమానాలను విధించాలని ఆదేశించారు. రోడ్ల వెంట చెత్త, వ్యర్థాలు ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. ప్రతి దుకాణాన్ని పన్ను పరిధిలోకి తీసుకొచ్చి, ట్రేడ్ లైసెన్స్‌లు పొందేలా చూడాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలపై తనిఖీలను చేపట్టాలని పేర్కొన్నారు. ఎంహెచ్‌ఓ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, జిజియాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవం

నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో తాళ్లపాక అన్నమాచార్యులు ఆరాధన మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి జ్యోతి ప్రజ్వలన చేశారు. అన్నమాచార్యులు సంకీర్తనలను ఆలపించారు.

మహాధర్నాపై వినతిపత్రం అందజేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తిరుపతిలోని సీఎండీ కార్యాలయం వద్ద ఏప్రిల్ ఏడున నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన వినతిపత్రాన్ని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావుకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహాధర్నాకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శులు సుమన్, కుమార్, జిల్లా నేతలు మహేష్, సుబ్రమణ్యం, ఆసిఫ్, రాజశేఖర్, సునీల్, విజయ్‌కుమార్, వేణు, మధు, లోకేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

నెల్లూరు(క్రైమ్): మహిళపై దాడికి పాల్పడిన నిందితులపై కేసును వేదాయపాళెం పోలీసులు బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొండాయపాళెంలో నివాసం ఉంటున్న శైలజ తన ఇంటి మరమ్మతుల నిమిత్తం గృహం ముందున్న రహదారిపై ఇసుకను గత నెల 13న నిల్వ చేశారు. తమ ఇంటికెళ్లే దారిలో ఇసుకను నిల్వ చేస్తావా అంటూ పక్కింటికి చెందిన పద్మమ్మ, మరో ఇద్దరు ఆమెపై దాడి చేసి గాయపర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సీబీఎస్‌ఈ స్కూల్ ప్రారంభం



మాట్లాడుతున్న శేషారెడ్డి

నెల్లూరు (టౌన్): నగరంలో జీవీకే ఇంటర్నేషనల్ సీబీఎస్‌ఈ గర్ల్స్ హైస్కూల్‌ను కస్తూరిదేవి విద్యాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించామని కరస్పాండెంట్, కమిటీ సెక్రటరీ దొడ్ల శేషారెడ్డి పేర్కొన్నారు. కస్తూరిదేవి గార్డెన్స్‌లో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లను ప్రారంభించనున్నామని తెలిపారు. స్కూల్ ఏర్పాటుకు రూ.25 కోట్ల విరాళాన్ని జీవీకే రెడ్డి అందజేశారని వెల్లడించారు. తొలుత ఎల్కేజీ నుంచి ఏడో తరగతి వరకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఉత్తమ విద్యను అందించాలనే లక్ష్యంతో పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. తక్కువ మొత్తంలో ఫీజులను వసూలు చేయనున్నామని చెప్పారు. స్కూల్ డైరెక్టర్ ఉషారెడ్డి, కస్తూరిదేవి విద్యాలయ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆదిశేషారెడ్డి, రామశేఖర్, ఏట నరేష్ తదితరులు పాల్గొన్నారు.

29న విశ్వబ్రాహ్మణ సేవా సంఘ వార్షికోత్సవం



నెల్లూరు(బృందావనం): విరాట్‌నగర్‌లోని వీబీఎస్ కల్యాణ మండపంలో నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ వార్షికోత్సవ వేడుకలు, సంఘ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29న నిర్వహించనున్నామని సంఘ వ్యవస్థాపక, శాశ్వత అధ్యక్షుడు కందుకూరు చెంగయ్య ఆచారి, ప్రధాన కార్యదర్శి ఇందుకూరు రమేష్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను వీబీఎస్ కల్యాణ మండపంలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. కల్యాణ మండప ప్రాంగణంలో పంచవృత్తుల పతాకావిష్కరణ, దేవస్థానంలో ప్రత్యేక పూజలు తదితరాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. నేతలు అలిమేలి సుబ్రహ్మణ్యం, దండపాణి సురేష్, బల్లవోలు రమణయ్య, బాలకృష్ణ, పాలూరు ఈశ్వరయ్య, చంద్రశేఖర్, రమేష్, వెంకటేశ్వర్లు, బాలచంద్ర, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో వ్యాక్సిన్



నెల్లూరు(టౌన్): క్షయ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు గానూ అన్ని సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచామని డీఎంహెచ్‌ఓ సుజాత తెలిపారు. జిల్లా క్షయ నిర్మూలన కార్యాలయంలో క్షయ వ్యాధి నిర్ధారిత పరీక్ష కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, నియంత్రణాధికారి ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

యోగా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న యోగా దినోత్సవంలో భాగంగా యోగా క్రీడాకారులు, సంస్థలకు ప్రధాన మంత్రి యోగా అవార్డులను ప్రదానం చేయనున్నారని, దీనికి గానూ అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు innovateindia, mygov.inలో ఈ నెల 31లోపు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ఏసీ బస్‌షెల్టర్లను అందుబాటులోకి తేవాలి



సూచనలు చేస్తున్న సూర్యతేజ

నెల్లూరు సిటీ: నగరంలో నిర్మించిన ఆరు ఏసీ బస్‌షెల్టర్లలో అన్ని సదుపాయాలను కల్పించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. గాంధీబొమ్మ, వీఆర్సీ సెంటర్, శబరి శ్రీరామక్షేత్రం, కరెంటాఫీస్ జంక్షన్, అయ్యప్పగుడి ప్రాంతాల్లో ఏసీ బస్‌షెల్టర్లను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అవసరమైన మరమ్మతులను పూర్తి చేసి, బోర్డుల పెయింటింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఏఈ అర్పిత తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో జాబ్ మేళా రేపు

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో జాబ్‌మేళాను ఏపీఎస్సెస్డీసీ, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. హీరో మోటో కార్ప్ లిమిటెడ్, యాక్ట్ ఫైబర్ నెట్ కంపెనీలు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నాయని చెప్పారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ డిప్లొమా చదివిన నిరుద్యోగ యువత ఆధార్ కార్డు, రెజ్యూమ్‌తో హాజరుకావాలని కోరారు. వివరాలకు 94944 5632 6, 97045 10793 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి



నెల్లూరు(బృందావనం): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరపాలని నెల్లూరు జిల్లా పాస్టర్లు తదితరులు డిమాండ్ చేశారు. ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలోని జీసస్ విగ్రహం వద్ద ప్రదర్శనను బుధవారం నిర్వహించిన అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రెవరెండ్లు డేవిడ్ దయాసాగర్, రాజశేఖర్ దాసరి, ప్రమీల రాజశేఖర్, బ్రదర్ ఊరందూరు సురేంద్రబాబు, బర్నబాస్, పాస్టర్లు బెన్హర్ బాబు, యేసురత్నం, ప్రభుకుమార్, రాఘవ మోజెస్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని చైర్మన్ సురేంద్రరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫ్యాప్టో చైర్మన్‌గా మధుసూదన్‌రావు (ఏపీటీఏ), సెక్రటరీ జనరల్‌గా జావీద్ (ఆర్‌యూటీఏ), కో చైర్మన్లుగా మురళీకృష్ణ (డీటీఎఫ్), ప్రసాద్ (బీటీఏ), భాస్కర్‌రెడ్డి (ఏపీహెచ్‌ఎంఏ) నియమితులయ్యారు. డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా శేషు (యూటీఎఫ్), నరసింహ (ఎస్టీయూ), హజరత్ (ఏపీటీఎఫ్), పిచ్చిబాబు (ఏపీటీఎఫ్ – 38)ను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా రమణయ్య వ్యవహరించారు. నేతలు ప్రసాద్, మురళీకృష్ణ, ఏడుకొండలు, హజరత్, చలపతి, చలపతిశర్మ, మణిసుబ్బు, దశరథరాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రికి బెడ్ షీట్ల వితరణ



నెల్లూరు (టౌన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రికి బెడ్ షీట్లను విజయవాడ లియోటెక్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. వీటిని ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్‌కు ఇచ్చారు.